# ఆపరేషన్ కిచెన్

## ఓ.జి.రామారావు

అసలు నా శ్రీమతికీ నాకూ తగాదా ఎలా వచ్చిందో గుర్తు లేదు. నిజానికి అది తగాదా కూడా కాదు. మా వ్యక్తిత్వాలలో వచ్చిన ఘర్షణ. ఒకరికొకరు లొంగకూడదన్న పట్టుదల!

కొద్దిరోజులనుండి మా ఆవిడ విసుక్కోడం వింటున్నాను. నాతో ఎదురుగా అనకపోయినా ఆవిడ విసురు నాకే ఉద్దేశించబడ్డాయని నాకు తెలుసు. ఉదాహరణకు ఆవిడ కంప్లయింట్సులో కొన్ని :

'ఎక్కడికీ కదలడానికి వీలులేదు. ఇల్లు ముడై పోయింది'

'మా అన్నయ్యగారబ్బాయి బారసాలకి వెళ్ళలేకపోయాను. నా దురదృష్టం!'

'నా ఫ్రెండ్ విజయ కూతురు పెళ్ళికి వెళ్ళనేలేదు. విజయ నన్ను జీవితంలో క్షమించదు'


'ఏమే, అప్పి. నువ్వు హఠాత్తుగా ఊరెడితే నా పనేం గాను? నీకేం, నీ యిష్టం వచ్చినప్పుడు నాగాలు పెట్టేస్తావ్. కాని నా ఒక్క నాగా లేదుగా!'

యిదీ వరస. నాకు వళ్లు మండింది. ఏమిటి, ఎవరిని ఉద్దేశించి యీ చిరాకులు? అంతగా ఆవిడ ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటే ఎవరొద్దన్నారు? నేనేమైనా యీవిడను తాళ్ళేసి కట్టేశానా? తను కావాలనుకున్నది నేను ఏది కాదన్నాను? మరి, యీమాత్రందానికి, నేనేదో ఆవిడను జైల్లో పెట్టి బంధించినట్టూ, హౌస్ అరెస్ట్ చేసినట్టూ ఎందుకీ వ్యంగ్యగర్భ, దుర్భర సంభాషణలు?!

నా కోపం పైకి కనబడనీయకుండా ఓ రోజున నిర్లిప్తంగా అన్నాను "అంత ఎక్కడికైనా వెళ్లాలనుంటే, వెళ్ళలేకపోయావా? యిక్కడుండి నువ్వు చేసేదేమిటి?" ఆ ఆఖరిమాట అని వెంటనే నాలిక్కొరుక్కున్నాను. ఆవిడ యింట్లో ఎంత పనిచేస్తుందో నాకు తెలుసు. కాని గాలిలో వదలిన మాట వెనక్కి తీసుకునే మార్గం లేక దీని పర్యవసానం ఎలా వుంటుందోనని ఆందోళనగా ఎదురు చూస్తున్నా.

"నేనుండి చేసేదేముందా?" ఆవిడ నన్ను మింగెయ్యాలన్నంత కోపంతో చూసింది. "అయితే ఉండండి మీ పని చెబుతాను. మా అక్కయ్య విజయవాడ రమ్మని ఆరుత్తరాలు రాసింది. నేను రేపే వెడతాను. ఏ హోటల్లో తింటారో, ఏం చేస్తారో చూసుకోండి" అని. నేనేమాత్రం చలించకపోడం చూసి యీసడింపుగా అంది "మళ్ళీ టెలిగ్రాములమీద టెలిగ్రాఫు

హాస్యకథల పోటీలో



తిస్తాడు. పిల్లు చెప్పగానే సరికదు!"
నా అహం దెబ్బతింది. ఒక్క తిండి కోసం ఆమెమీద, ఆవిడ వంటమీదా ఆధార పడి ఉంటున్నా ననుకుందా?
నాలుగు రోజులు ఏ హోటల్లోనో తింటాం. ఏమీ ఫరవాలేదు" అన్నాను

---

## ఎన్నికయిన కథ

నిర్లక్ష్యంగా.

ఆవిడ చర్రున లేచింది.

"ఇంక తింటారు హోటల్లో! నేను హాస్పిటల్‌లో ఉన్నప్పుడు తిన్నారుగా! రెండు రోజులు తిని, డిసెంట్రీ పట్టుకుని మూడు వారాలు మంచమెక్కారు మరిచిపోయారులా ఉంది."

నేను మరచిపోలేదు. ఆ అనుభవం మరచిపోలేను కూడా. కానీ యిది నా ఆరోగ్యానికి సంబంధించిన విషయం కాదు. నా వ్యక్తిత్వానికి, నా స్వతంత్ర ప్రతిపత్తికి సంబంధించిన సమస్య.— "లేకపోతే మేమే యింత ఉడకేసుకు తింటాం. నువ్వు నిరభ్యంతరంగా విజయవాడ వెళ్ళిరా" అన్నాను కసిగా. 'మీకోసారి శాస్త్రి జరిగి కాని బుద్ధి రాదు!' అన్నట్టు ఆవిడ నాకేసి కొరకొరా చూసింది. ఆ చూపుకి నాకు షాక్ తిన్నట్టయింది.

ఏమిటీ యీవిడ గర్వం? ఏమిటీ డబాయింపు? వంటంటే ఏమైనా ఏటమిక్ సైన్సా? దీనికి అమెరికానుంచి యురేనియం, రష్యానుంచి టెక్నికల్ నోహౌ, వరల్డ్ బ్యాంక్ నించి ధన సహాయం కావాలా? కావలసిందల్లా ఉప్పూ, చింతపండూ, కారం! యీమాత్రందానికి ఏదో తనకే భగవదనుగ్రహంవల్ల వంటవిద్య అబ్బినట్టూ, యింకెవరికీ ఆ రహస్యం తెలియదన్నట్టూ ఏమిటీ అహంకారం? అసలు యీవిడేనా, ఆడవాళ్ళంతా యిలా మిడిసిపడుతుంటారా? యిదేదో నేనుం తేల్చుకోదలిచాను.

ఆవిడ చూపును నేనెంతమాత్రం ఖాతరు చెయ్యలేదన్నట్టు సన్నగా విజిల్ పాట మొదలెట్టాను. ఆవిడ మరో క్షణం అలాగే చూసి, చేతిలో ఉన్న చీపురు వంటింట్లోకి విసిరి బెడ్‌రూమ్‌లోకెళ్ళి ఢళ్లున తలుపేసుకుంది. వంటింట్లోంచి ఆర్. డి. బర్మన్ ఆర్కెస్ట్రాలా ధ్వనులు వినిపించాయి. ఆవిడ విసిరిన చీపురు తిన్నెమీదున్న ఓ గిన్నెకు తగిలింది. చంచల స్థిరత్వ స్థితిలో ఉన్న ఆ బోడి గిన్నె ఊగి, ఊగి కిందనున్న రెండు పింగాణీ ప్లేట్ల మీద పడింది. నవ నాగరికంగా పెరిగిన నాజూకు ప్లేట్లు కంచుగిన్నె మోటు సరసానికి మూడు ముక్కలై, ముక్కంటి మూడోనేత్రం లాంటి ఓ ముక్క నా కుర్చీకి తగిలి పరావర్తనం చెంది, నా చేతిని దూసుకుపోయి, గీసుకుంది. రక్తం చిమ్మింది. మా ఆవిడ చూపు ఎంత వాడిగా ఉందో నా కప్పుడు తెలిసింది!

యిద్దరం పాయింటు ఆఫ్ నో రిటర్న్‌కి చేరుకున్నాం. రాజీప్రసక్తి లేదు. నేను బయట కొచ్చి స్కూటర్ బర్ర్ మనిపించి క్లబ్‌కి పోయాను. సాయంత్రం యింటికి చేరే సరికి మా ఆవిడ సామాన్లు సర్దేసుకుంది. ఒక ట్రంక్, చిన్న బెడ్డింగ్, బుట్ట! నాకు కాళ్ళు వణికాయి. ఎంత పతనం! ధైర్యం తెచ్చుకుని గదిలోకి అడుగు పెట్టాను. 'నేను రేపుదయం వెళుతున్నాను' అంది ఆమె.

'మంచిది'—నేను.

'డబ్బు?'—ఆమె.

'బీరువా'—నేను.

'తాళాలు?'—ఆమె.


'టేబుల్ డ్రాయరు'—నేను.

'ఎంత?'—ఆమె.

'కావలసినంత'—నేను.

భాష నింత పొదుపుగా వాడుకోవచ్చని యిద్దరం అప్పుడే గ్రహించాం. తర్వాత ఆ భాష కూడా అవసరంరాలేదు. ఆరాత్రి యిద్దరం మౌనంగా గడిపాం. రాత్రి చేయి జాపినా తగలనంత దూరంగా పడుకున్నాం ఒకే పక్కమీద!

ఉదయమే స్టేషను దాకా సాగనంపి వచ్చాను. పళ్ళు బిగించి కళ్ళతోనే మాట్లాడుకున్నాం. రైలు కదులుతుంటే "వెళ్ళిపోతున్నావ్?" అన్నట్టు చూశాను. "మీరు వెళ్ళిపొమ్మన్నారు కదూ?" అన్నట్లు ఆవిడ చూసింది. ఆవిడ టా! టా! చెప్పలేదు. నేను బై! బై! చెప్పలేదు.




బరువు గుండెలతో యింటికి తిరిగొచ్చాను.

యింట్లోకి వెళ్ళబోతూంటే, మా పక్కింటావిడ గోడవతలనుంచి ఓ బాంబు పడేసింది-'మీ పాలవాడొచ్చి వెళ్ళిపోయాడండీ' అంటూ. నేను కొయ్యబారి పోయాను. స్టేషనుకు వెళుతూ, పిల్లలు యింకా లేవరు కదా అని బయట తాళం పెట్టి వెళ్లాను. దాని ఫలితం పాలు సున్నా. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. మా ఆవిడ రిక్షా ఎక్కుతూ 'పా........' అని వెంటనే మూతి బిగించుకుంది. 'పాప లిద్దరూ జాగ్రత్త' అని చెప్పబోయిం దనుకున్నాను. యిప్పుడర్థమైంది. 'పాలవాడొస్తాడు' అని జ్ఞాపకం చెయ్యబోయి మానేసింది. నా మీద ఎంత కసి తీర్చుకుంది!

పొద్దుటే ఫిల్టరు కాఫీ పడితేగాని నా నరాలు చచ్చుబడిపోతాయి. అందుకని వెంటనే బయలుదేరి వీధులన్నీ గాలించి ఓ పాలవాణ్ణి లాక్కొచ్చాను. అప్పటికే పిల్లలిద్దరూ లేచి, బిక్క మొహాలు వేసుకుని కిటికీ ఊచలు పట్టుకు వేళ్ళాడు తున్నారు. వాళ్ళని సముదాయించుకుని, కాచి ముందర వాళ్ళని సంతృప్తి పరిచాను. యింక నా కాఫీ, నా నెర్వైన్ టానిక్ పడితే భీముడినై పోతాను. వస్తూనే ఫిల్టరులో యింత పొడి వేసి, వేన్నీళ్ళు పోసి ఉంచాను. కాని అర గంటైనా ఒక్క చుక్క దిగలేదు. ఫిల్టరులో నీటి మట్టం తగ్గలేదు. ఆశ్చర్యపోయాను. సిమెంటు, కంకర వేసి దట్టించిన యింటి స్లాబులే చినుకు పడితే చెమర్చి నీరు దిగిపోతున్నాయి. అలాంటిది రెండు చెంచాల కాఫీ పొడి నీటిని పూర్తిగా అటకాయించడం భౌతిక శాస్త్రానికే విరుద్ధమనిపించింది. యిళ్ళు కట్టించే వాళ్ళు సిమెంటుతో పాటు ఓ బస్తా కాఫీపొడి కూడా కలిపి స్లాబ్ వేస్తే యిక నీళ్ళు చెమర్చవు కారవనిపించింది. కాఫీ ఆలస్యమై నాకు పిచ్చెత్తి పోతోంది. యింక ఓర్పు వహించి, ఓ అట్లకాడ పుచ్చుకుని, ఫిల్టరు సొట్టపడేలా యిటూ, అటూ బాదాను. ఎలాగో ఓ ఔన్సు దిగింది. కానీ మడ్డిమయం. మా ఆవిడ కాఫీ డికాక్షన్ తీస్తే ముఖం చూసుకునేంత స్వచ్ఛంగా ఉండేది. నా ఖర్మ! ఆ మడ్డి కాఫీయే రెండు గుక్కలు తాగి ముందు కార్యక్రమానికి ఉపక్రమించాను.

పది గంటలైంది అయింది. స్థిమితంగా నా "ఆపరేషన్ కుకింగ్" ప్రారంభించ వచ్చు ననుకుంటూ స్టోర్ రూమ్‌లో అడుగు

పెట్టాను. వెనకనే మా పెద్దమ్మాయి పన్నెండేళ్ళ శశివచ్చి "నాన్నా యివాళ మాకు స్లిప్ టెస్టుంది. తొమ్మిదికల్లా స్కూలు కెళ్ళాలి" అంది మా చిన్నాడు అరవిందు, "మా స్కూలుబస్ తొమ్మిదింటికొచ్చేస్తుంది" అన్నాడు గొప్పగా. ఒక్కసారి దిగాలు పడిపోయాను. సావకాశంగా కానిద్దామనుకున్న కార్యక్రమం ఒక్కసారి "ఎమర్జెన్సీ" గా మారి పోయింది. మొదటి రోజే పిల్లల "మొరాల్" దెబ్బతింటే, ఆవిడ వచ్చేవరకు వీళ్ళని సముదాయించటం కష్టం. అందుకని లేని ఉత్సాహం తెచ్చుకొని, అరిచాను. "ఎస్! మీకు ఎనిమిదిన్నర కల్లా భోజనం తయార్! ఏం కావాలి మీకు?"

వాళ్లు వెంటనే కూటు, సాంబారు, గోంగూర పచ్చడి లాంటి హెవీ అయిటములు ఒకళ్ళ మీద ఒకరు పోటీలు పడుతూ కోరేసుకున్నారు.

"అవన్నీ సాయంత్రం! యీ పూటకి మీకు బ్రహ్మాండమైన వేపుడు. బ్రహ్మాండమైన ఛారూ...." అంటూ మొదలుపెట్టాను. నాటకీయతతో. వాళ్లు తినబోయే నా "బ్రహ్మాండాలకి" మురిసిపోయి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

అన్నిటికన్న సులభంగా అయేది బెండకాయ వేపుడు అని గుర్తు చేసుకుని, బెండకాయలు తీసి తరగడం మొదలు పెట్టాను. నేను ఎప్పుడైనా వంట పనిలో సహాయపడతానంటే మా ఆవిడ "ఏదైనా చెయ్యండికాని, కత్తిపీట జోలికి మాత్రం రావద్దని" హెచ్చరించేది. అప్పట్లో అర్థరహితమైన ఆవిడ ఆందోళనకి నవ్వుకునే వాడిని. కాని ఆవిడ హెచ్చరికలో ఉన్న ఔచిత్యం యిప్పుడర్థమైంది. వేళ్ళు మూడుచోట్ల నరుక్కుపోయాయి! నా అరచేతిలో (దురదృష్ట) రేఖలు గుండా, రక్తం, గంగానదీ దాని ఉపనదుల రేఖాపటం గీసినట్టు పాకింది. వెంటనే వెళ్ళి ప్రథమ చికిత్స చేసి రక్తస్రావం అరికట్టి, యింత డెట్టాల్ పట్టించుకొచ్చి తరగడం పూర్తిచేశాను. ఆవేశం తప్ప ఆలోచన లేని యీపని ఫలితంగా తరిగిన ముక్కలు డెట్టాల్ వాసన గుప్పున కొడుతున్నాయి. అది గమనించి కంగారు పడి అదే ఆవేశం మైనస్ ఆలోచనతో గబగబా వెళ్ళి, ముక్కలన్నీ కుళాయి దగ్గర కడగడం ప్రారంభించాను. అంతే-ఒకటే జిగురు. కడిగిన కొద్దీ యింకా వస్తోంది. నేనొక పెద్ద జిగురు మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభించినట్టుంది దైవికంగా, పనిమనిషి అప్పలమ్మ చూసి "ఆ జిగురు కడిగితే పోదని, అలానే వేయించేయమని" సలహా యిచ్చింది.

ఆ ప్రకారం ముక్కలు తీసుకెళ్ళి మూకుడులో వేశాను. అంతకు ముందే కుక్కరులో కాసిని నీళ్ళుపోసి స్టౌమీద పెట్టాను. అందులో నీళ్ళు మరుగుపట్టాయి. ఓ గిన్నెలో పప్పు పెట్టాను. చారుకి మరో గిన్నెలో, నాకు ఉచితమని తోచినంత చింతపండూ, చిటికెడు పసుపూ, ఉసిరికాయంత బెల్లం, కందిపొడి అని రాసున్న కార్నవిటా డబ్బాలో ఉన్న చారుపొడి రెండు చెంచాలు వేసి కుక్కరులో పెట్టాను. చారు చూస్తుంటే చాలా బాగా కుదురుతుందని నమ్మకం కలిగింది. "నాన్నా, అమ్మ చారుకన్న నీచారే చాలా బాగుందని," పిల్లలు నన్ను మెచ్చుకుంటున్న దృశ్యం కళ్ళకు కట్టి సంతృప్తిగా నవ్వుకున్నాను.

యిక అన్నం! బియ్యం ఉడికించి మెత్తగా చెయ్యడంకన్న అన్నం వండడంలో ఏమీ కాంప్లికేషన్లు లేవుకదా అనుకుంటూ ఉత్సాహంగా స్టోరు రూముకి వెళ్లి బియ్యం తేబోయాను. హఠాత్తుగా ఓ భయంకరమైన ప్రశ్న ఎదురైంది. ఎంత, లేక ఎన్ని బియ్యం? సోలడా? తవ్వెడా? ... కుంచెడా? ఎంత? ఎంత? ఆప్రశ్న నన్ను వేధించేసింది. యిన్ని సంవత్సరాలనుండి అన్నం తింటూ మనిషికి సగటున ఎన్ని బియ్యం కావాలో తెలుసుకోని నా అజ్ఞానానికి, మూర్ఖత్వానికి నన్ను నేను

నిందించుకున్నాను. ఓమూల ప్రెషర్ కుక్కరు రైలింజనులా ఆవిరి చిమ్ముతోంది. బియ్యం డబ్బాదగ్గిర విమూఢ దైన్య మూర్తిలా నుంచున్న నా మెదడులో ఒక్క మెరుపు మెరిసింది! ఒకసారి మా ఆవిడ మాటల సందర్భంలో అంది 'మనకు నెలకు ఆరు కుంచాల బియ్యం ఉండాలండీ' అని. యింకేముంది, సమస్య పరిష్కారమై పోయింది.

నలుగురు మనుష్యులకి అరవై పూట్లకి ఆరు కుంచాలైతే, ముగ్గురు మనుష్యులకి ఒక పూటకి ఎంత? కాలము-పని లెక్క! వెంటనే కాయితం కలం తీసుకుని లెక్క కట్టి ఆ ప్రకారం బియ్యం కొలిచి గిన్నెలో పోశాను. ఆ సమయంలో నా సమయ స్ఫూర్తికి, గణిత ప్రావీణ్యానికి నన్ను అభినందించుకున్నాను. ఆడవాళ్ళు పదేళ్ళ అనుభవంతో నేర్చుకున్నది నేను నా మేధస్సుతో ఒక్క క్షణంలో గ్రహించాను. యిది మగజాతికే గర్వకారణ మనిపించింది. స్వోత్కర్షతో, ఆనందంతో పెదవులపైన విరియబోయిన నవ్వు మొగ్గలోనే రాలి పోయింది. కారణం? యింతకన్న భయంకరమైన ప్రశ్న ఎదురైంది. యీ బియ్యానికి ఎన్ని నీళ్ళు పొయ్యాలి? పైగా కుక్కరుతో వ్యవహారం! మధ్య, మధ్య చేర్పులకీ, మార్పులకీ సావకాశం లేదు. శశిని సంప్రదించాను. అది వట్టి బడుద్ధాయి. దానికేమీ తెలియదు. నోరు అప్పళించింది అప్పలమ్మ వెళ్ళిపోయింది. నాకు సలహా యిచ్చేవాళ్ళు లేరు. మళ్ళీ నా మెదడునే నమ్ముకున్నాను. నన్ను 'మేల్ షావనిస్ట్ పిగ్' అన్నా ఫరవా లేదు. మెదడు మొగాడి సొమ్ము. నా కో బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. నేనే ఆర్కిమెడిస్ నైతే 'యురేకా!' అని అరచి ఉండేవాడిని. నా సమస్యా పరిష్కారానికి ఓ చిన్న ప్రయోగం చేశాను.

"క్రితం రాత్రి వండిన అన్నములో నుండి ఒక మెతుకు తీసుకున్నాను. దానిని శుభ్రముగా తుడిచిన ఒక ప్లేటులో ఉంచాను. దానికి దగ్గరగా, ఉడకవలసిన బియ్యంనుండి ఒక గింజ ఉంచినాను. పారలాక్సు దోషము లేకుండా లంబకోణము నుండి రెండూ పరిశీలించాను. ఉడికిన మెతుకు, ఉడకని గింజకు ఎన్ని రెట్లుండెనో సాధ్యమైన దశాంశ భిన్నమువరకు ఊహించి సవరించినాను." యీ ప్రయోగ ఫలితముగా బియ్యపుగింజకన్న మెతుకు నాలుగురెట్లు పెద్దదిగా గ్రహించి, బియ్యపు గింజ తన పరిమాణమునకు నాలుగు రెట్లు నీటిని గ్రహించినట్లు నేను గ్రహించి, బియ్యం పరిమాణమునకు నాలుగురెట్లు నీరు పోసి కుక్కరులో ఉంచాను.

యింత శాస్త్రీయంగా, పరిశోధనా ఫలితంగా తయారవబోతున్న అన్నం మల్లెపువ్వులా విరిసిపోతుందని పూర్తిగా విశ్వసించాను. ఆ సమయంలో, 'నిత్య జీవితంలో భౌతిక శాస్త్రము—దాని ఉపయోగములూ' అని ఓ పుస్తకం రాయాలన్నంత ఉత్సాహమొచ్చింది.

బెండకాయ వేపుడైతే నా వంట పూర్తయినట్టే. యింతలో నా మిత్రుడొకడొచ్చాడు. శశిని పిలిచి, ఓ గరిటె చేతికిచ్చి, ముక్కలుకదుపుతూ ఉండమని వెళ్ళి మిత్రుడితో మాట్లాడుతున్నాను. మరో అయిదు నిముషాలకి శశి నన్ను లోపలికి పిలిచి 'నాన్నా, ముక్కలు వేయిస్తుంటే దారాలొస్తున్నాయి!' అంది బిక్క మొహంతో. మళ్ళీ నా మెదడు గిర్రున తిప్పేశాను. అర్థమైంది! ద్రవరూపంలో ఉన్న బెండకాయ జిగురు వేడికి ఘనీభవించే సందర్భంలో తీగె, లేక దారం రూపందాల్చింది, అంతే! అమ్మాయికి ధైర్యం చెప్పి పంపాను. మళ్ళీ కబుర్లలో పడ్డాను మరో నిముషానికే శశి కంగారుగా పిలిచింది. వెళ్లాను. 'నాన్నా బాగా దారాలొచ్చేస్తున్నాయి!' అని కొన్ని చూపించింది. అది జిగురు కాదు. దారాలు సూమల్లా ఉన్నాయి. గుండె గుభేల్ మంది. ఒక్క దుముకులో వంటింట్లోకెళ్ళి మూకుడు పరిశీలించాను. శశికి కలపడానికిచ్చిన గరిటె

నగం కరిగిపోయింది. పొరపాటర్థమైంది. అది ప్లాస్టిక్ గరిట!

వళ్లు మండిపోయి, ముక్కలన్నీ బయట గుమ్మరించి వచ్చాను. తలవని తలంపుగా జరిగిన యీ దుర్ఘటనకి పిల్లలిద్దరూ నాకు తీవ్రమైన సానుభూతి చూపించి 'కూరలేకుండా తినడానికి'దయతో అంగీకరించారు.

గడియారం నా నెత్తిమీద తొమ్మిది గంటలుకొట్టింది మిత్రుణ్ణి పంపేశాను. పిల్లలప్పుడే బిల, బిల మంటూ డైనింగ్ టేబిల్ దగ్గర చేరి కంచాలు, గ్లాసులూ పెట్టేసుకుని 'అన్నం,అన్నం'అని గోల ప్రారంభించారు. నాకు కాళ్ళలోంచి వణుకు ప్రారంభమైంది. గబ, గబా వెళ్ళి కుక్కరు మూతతీశాను. ఆవిరి గుప్పున చేతికి కొట్టింది. వేళ్ళు మాడిపోయాయి. అంత బాధా ఓర్చుకుని గిన్నెలు బయటకు తీశాను. పప్పు! నీళ్ళలో గుండ్రని ప్లాస్టిక్ ముక్కలు వేసినట్లున్నాయి-కంది బద్దలు! నీళ్లు వంచేసి అవే తీసుకెళ్ళి యిద్దరి కంచాల్లో వడ్డించాను

"ఛీ! ఛీ! పప్పు యిలా ఉందేమిటి?" అంటూ యిద్దరూ ఏకగ్రీవంగా అసహ్యించుకున్నారు. "ఏడిశాదు. కలుపుకుంటే మెత్తబడతాయి" అని దబాయించి, అన్నం గిన్నె తెచ్చాను. అన్నం పైకి పువ్వులా కనిపించినా, గరిటె పెట్టగానే, నీళ్ళుగారిపోయి, జావలా ఉంది. ఒక్కసారి నీరసపడిపోయాను - నా గణితం ఎక్కడో తప్పింది! నా లెక్కలు నన్ను మోసం చేశాయి. ఇప్పుడు విచారించి లాభంలేదు. యిప్పుడు తక్షణ కర్తవ్యం, యించుమించు ద్రవరూపంలో ఉన్న అన్నం ఘనీభవింప చేయాలి. దానికి ఒకటే మార్గం అది బాష్పీకరణం. బాష్పీకరణం బాగా జరగాలంటే ఉపరితలం పెంచాలి. దీనికి అనువైన గృహోపకరణం చాట అని గుర్తించి వెంటనే చాట తీసుకొచ్చి అన్నం అంతా అందులో గుమ్మరించాను. ఫ్యాన్ ఫుల్ స్పీడ్ లో పెట్టాను. కిటికీ తలుపులు తెరిచాను

"యిప్పుడు, చాట చిల్లుల ద్వారా ఎక్కువ శాతము నీరు క్రిందికి వడగొట్టుట, అన్నం పరిచి ఉపతలము పెంచుట, తీవ్ర వాయు సంచలనము కలిగించుట మొదలైన మూడు విధముల నీటిని హరించుమార్గము ఒకేసారి ఉపయోగించుటచే," అన్నం అయిదు నిమిషాల్లో గట్టి పడుతుందని అంచనా వేసుకున్నాను.

కాని ఫలితం ఆశించినట్టుగా లేదు. ఆఖరికి ఆ చిముడు ముద్దలే వాళ్ళ కంచాల్లో వడ్డించాను. వాళ్లు గతిలేక అదే మింగడం మొదలెట్టారు. చారు కలుపుకుని "తూ! తూ!" అని ఉమ్ములు మొదలుపెట్టారు. కూర, అన్నం, పప్పు ఫెయిలయిపోయినా యివాళ చారు ఫస్ట్ మార్కు కొట్టేస్తుందనుకున్నాను వీళ్ళ అసహ్యానికి కారణమేమై యుంటుందా అని కాస్త వేడిచారు నోట్లో పోసుకున్నాను. నాలిక్కాలిపోయింది ఉప్పు లేదు! చారు, కేసి దీనంగా చూస్తూ 'యూ టూ బ్రూట్!' అనుకున్నాను మనసులో, నమ్మిన బంటనుకున్న బ్రూటస్ కత్తిపోటుకి సీజర్ విలపించినట్టు. నిస్సహాయంగా యిద్దరి కంచాల్లో కాస్త ఉప్పువేసి 'తినండి!' అని గదిమాను. వాళ్ళు తిన్నారు....ఏడుస్తూ. ఎలాగో భోజనాలయాయనిపించి యిద్దరినీ స్కూలు' సాగనంపాను.

పిల్లలిని అర్థాకలితో పంపి ఎందుకు ప్రాణంఉసూరుమంది వంటిల్లంతా చిందరవందరగా, యుద్ధ భూమిలాగుంది. బయట పారేసిన బెండకాయ ముక్కలూ. ప్లాస్టిక్ దారాలు, నేను లెక్కలు కట్టిన కాగితాలు నా పరాజయాన్ని గుర్తుచేసి వెక్కిరిస్తున్నాయి.

నా ప్రయోగాలతో పిల్లలను ఆకలితో మాడ్చే సాహసం నాకు లేదు. స్నానంచేసి బట్టలు వేసుకుని తిన్నగా పోస్టాఫీసుకి వెళ్ళాను, శశి పేరుతో ఓ టెలిగ్రాంపంపాను, 'ఫాదర్ అన్ వెల్. స్టార్ట్ యిమిడియట్ లీ!'*